ప్రజాశక్తి

సోమవారం 10 నవంబరు 2025 5

శ్రీకాకుళం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయొచ్చని తెలిపారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నత్తనడకన 'జల్ జీవన్'

- 'జల్ జీవన్' పనుల్లో జాప్యం
- గడువు పొడిగించినా కానరాని పురోగతి
- ఇంటింటికీ తాగునీరు ఎప్పటికి సాధ్యమయ్యేను?

గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీరందించే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్ పథకాన్ని రూపొందించారు. ప్రతి వ్యక్తికి 55 లీటర్ల తాగునీటిని అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా గ్రామంలోని అన్ని కుటుంబాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. స్థానికంగా తాగునీటి వనరుల లభ్యత, అవసరమైనచోట అదనపు బోర్లు, ట్యాంకులు, పైపులైన్లు నిర్మించి తాగునీటి సమస్యను అధిగమించడం ప్రధాన కర్తవ్యం. నాలుగేళ్ల కాలపరిమితితో ప్రారంభించిన పనుల్లో ఆశించిన పురోగతి కనిపించ లేదు. 2024 నాటికి పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా నిర్దేశించినా, పనులు ముందుకు సాగకపోవడంతో మరో ఏడాది గడువు పొడిగించినా లక్ష్యం మాత్రం ఆమడదూరంలోనే ఉంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని 30 మండలాల్లో 912 పంచాయతీలు, 2,129 గ్రామాలు ఉన్నాయి. మొదటి దశలో గతేడాది డిసెంబరు నాటికి 4,87,307 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలనుకున్నారు. ప్రస్తుతం 2,56,499 ఇళ్లకు కుళాయిలు ఏర్పాటు చేశారు. ఇంకా 2,30,810 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు అందించాల్సి ఉంది. ఈ పనులు అనుకున్నంత ముందుకు సాగడం లేదు. చాలాచోట్ల పనులు నిలిచిపోయాయి. దీంతో గడువును మరో ఏడాది పెంచి ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని భావించారు. ఆ గడువులోగా లక్ష్యం సాధించే అవకాశాలు కానరావడం లేదు. బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ జాప్యం, అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వంటి కారణాలతో పనులు ముందుకు సాగడం లేదు.

ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటలో నిరుపయోగంగా పైపులు

కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు చేతులెత్తేయడం సమస్యగా మారుతోంది. చాలా చోట్ల పనులు ఆగిపోయాయి. జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టే పనులను రెండు కేటగిరీలుగా విభజించారు. రూ.ఐదు లక్షల్లోపు పనులను ఒక కేటగిరీగా, ఆపై ఖర్చు దాటిన పనులను రెండో కేటగిరీగా వర్గీకరించారు. గ్రామస్థాయిలో విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ ఏర్పాటు చేసినా ఉన్న నీటి వనరుల వినియోగానికి మాత్రమే వీరు కృషి చేయగలరు. ప్రారంభం కాని పనులు, అధిక బడ్జెట్‌తో కూడిన పనులు నిర్వహణ సాధ్యం కాదు. జల జీవన మిషన్, సుజలధార పథకంలో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశాక పంచాయతీలు నిర్వహించాలి. పంచాయతీ దగ్గర నిధులు లేకపోవడం, నిర్లక్ష్యం వంటివి సైతం సమస్యగా మారుతున్నాయి. చాలాచోట్ల పైపులైన్ లీకులు, పనిచేయని నీటి పథకాలు వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. సకాలంలో మరమ్మతులు, అవసరం మేరకు నిధుల మంజూరు, టెండర్ల ఖరారు చేసి పనులు పూర్తి చేయడం వంటి సకాలంలో కావాలి. జల జీవన్ మిషన్ పనులు జిల్లాలో చాలావరకు పడకేశాయి. గ్రామస్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. అధికారులు స్పందించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రధానంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఉద్దానం వంటి ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ లీకులు సైతం సమస్యగా మారాయి. దీనివల్ల జల జీవన్ మిషన్ ఆశయానికి తూట్లు పడుతోంది.

ఫరీదుపేటలో తాగునీరు రాని కుళాయిలు

ఎచ్చెర్లలో వృథాగా పోతున్న తాగునీరు

పనుల పూర్తికి చర్యలు

అసంపూర్తి పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం. పూర్తిస్థాయిలో డిసెంబరు నాటికి కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలి. గ్రామీణ నీటి సరఫరా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. పనులు కాని టెండర్లను రద్దు చేసి, మళ్లీ టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకుంటాం. నిరంతరం ఈ పనులు పర్యవేక్షిస్తున్నాం.

- స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవ కమిటీ ప్రతినిధులు

రేపట్నుంచి సిక్కోలు పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి - అరసవల్లి

సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్నట్లు పుస్తక మహోత్సవ కమిటీ అధ్యక్షులు కె.శ్రీనివాసు తెలిపారు. సిక్కోలు పుస్తక మహోత్సవం - సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక సంబరాలు'ను విజయవంతం చేయాలని కోరుతూ నగరంలోని న్యూకాలనీలో గల డైమండ్ పార్కు నుంచి జి.టి రోడ్డు, ఏడు రోడ్ల కూడలి మీదుగా డేఅండ్‌నైట్ కూడలి వరకు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక మహోత్సవానికి పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వందలాది బుక్ స్టాల్స్ పుస్తక ప్రియులకు ఆనందాన్నిస్తాయన్నారు. విద్యార్థులు, పెద్దలు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలకు పుస్తక మహోత్సవం వేదిక కానుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కవులు, రచయితలు రచించిన పుస్తకాలు, కవితల ఆవిష్కరణలు, పరిచయాలు, సమీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

విద్యార్థులు, ప్రజలను చైతన్యపరిచే ఫన్ ప్రయోగాలు, టెలిస్కోప్ వీక్షణాలు, మ్యాజిక్ షోలు, శాస్త్రీయ ప్రయోగాలు, శాస్త్రీయ దృక్పథ సందేశాలతో జనవిజ్ఞాన వేదిక వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. 11న సాయంత్రం 4.30 గంటలకు పుస్తక మహోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 4.30 నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, చెకుముకి సైన్స్ సంబరాల జిల్లా కన్వీనర్ పి.కూర్మారావు, సుధాకరరావు, కె.భుజంగరావు, తెలుగు రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి ఆర్.వి రమణమూర్తి, కథానిలయం అధ్యక్షులు దాసరి రామచంద్రరావు, ప్రజాశక్తి జిల్లా మేనేజర్ పి.కామినాయుడు, కూన రంగనాయకులు, బి.ఉమామహేశ్వరరావు, తంగి ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి 17 వరకు మ్యాజిక్ వర్క్‌షాప్

సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం జెవివి సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 15, 16, 17 తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి మ్యాజిక్ వర్క్‌షాప్‌ను నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహితులైన సైన్స్ ఉద్యమ అభిమానులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు చెకుముకి సైన్స్ సంబరాల జిల్లా కన్వీనర్ పి కూర్మారావు మాట్లాడుతూ ఈనెల 23న జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నగరంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సిక్కోలు మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, హయ్యర్ ఎడ్యుకేషన్ జిల్లా కన్వీనర్ ప్రదీప్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వాగ్దేవి, సైన్స్ కమ్యూనికేషన్ కన్వీనర్ హనుమంతు మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలియాత్ర

ప్రజాశక్తి - జలుమూరు

కళింగ సామ్రాజ్య చారిత్రక వైభవాన్ని, ప్రపంచానికి నౌకా వర్తకాన్ని పరిచయం చేసిన పూర్వీకుల ఘనతను చాటిచెప్పేందుకు నిర్వహించిన బాలి యాత్ర ఉత్సవం ఆదివారం శ్రీముఖలింగంలో వైభవంగా నిర్వహించారు. శ్రీముఖలింగంలోని మధుకేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో.. వంశధార నదీ తీరంలో నిర్వహించిన యాత్రకు పెద్దసంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకొని సాయంత్రం వంశధార నదికి ర్యాలీగా వెళ్లి బాలి యాత్రలో ప్రధాన ఘట్టమైన అరటి తెప్పల్లో దీపాలు విడిచిపెట్టారు. దీపోత్సవానికి వెళ్లే వారికి గ్రామస్తులు ఆలయం వద్దనే అరటితెప్పలు, నూనె, నెయ్యితో కూడిన ఒత్తులు ఉచితంగా పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నదిలో తెప్పలు విడచిపెట్టే ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేసి, యాత్రికులు నదిలోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. నదికి వెళ్లే మార్గాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించారు. దీపోత్సవంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మాజీ చైర్మన్ పేరాడ తిలక్, డాక్టర్ జీవితేశ్వరరావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపిటిసి కె.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

శ్రీకాకుళం : దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని మైనారిటీ వెల్ఫేర్ డే, జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ హాల్‌లో ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకలకు జిల్లాలోని ఆయా శాఖల విభాగాధిపతులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆ హామీని ఎప్పుడు అమలు చేస్తారు?

- పెండింగ్ ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్న హామీని ఎప్పటిలోగా అమలు చేస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు ప్రశ్నించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు రూ.600 కోట్లు కేటాయిస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందని, ఎందుకు నిధులు కేటాయించడం లేదని మంత్రిని ప్రశ్నించారు. వంశధార లిఫ్ట్‌కు రూ.150 కోట్లు, రిజర్వాయర్ పనుల కోసం రూ.150 కోట్లు, ఆఫ్‌షోర్‌కి రూ.300 కోట్లు కేటాయిస్తే చివర భూముల వరకు నీరు అందిస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు నిధులు కేటాయించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల జిల్లా వెనుకబడుతోందని విమర్శించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, నేరడి బ్యారేజీకి అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చినా గెజిట్ నోటిఫికేషన్ ఎందుకు వేయించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. గెజిట్ నోటిఫికేషన్ వేసి నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం చేస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందని చెప్పారు. వంశధార ప్రాజెక్టు కట్టి 50 ఏళ్లు అయిందని, నేడు అది శిథిలావస్థలో ఉందని కేంద్ర ప్రభుత్వ ఎస్ఐఎంపి నుంచి కేంద్ర మంత్రి రామ్మోహన్ ఎందుకు నిధులు మంజూరు చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. వంశధార ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.1500 కోట్లు కేటాయిస్తే చివర భూముల వరకు నీరు ఇవ్వవచ్చని తెలిపారు. 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నేటికీ పూర్తి కాలేదని, దీనివల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందన్నారు. 2007లో ప్రారంభించిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు నేటికీ 13 కిలోమీటర్ల కాలువ తవ్వలేకపోయారు అంటే ప్రభుత్వ పని ఏవిధంగా ఉందో అర్థమవుతోందన్నారు. తుపాను వల్ల నష్టపోయిన రైతాంగానికి అందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టెక్కలిలో ప్రభుత్వాస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పోలాకి ప్రసాదరావు, బగాది వాసుదేవరావు, బొంతు ధర్మారావు, ఉర్జాన లక్ష్మణరావు, కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

సంతబొమ్మాళి : భావనపాడు సముద్రతీరంలో పర్యాటకుల సందడి

సముద్ర తీరంలో పిక్నిక్ సందడి

ప్రజాశక్తి - సంతబొమ్మాళి, పోలాకి

జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాల్లో ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. సంతబొమ్మాళి మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన భావనపాడు, మేఘవరం, సున్నాపల్లి, పోలాకి మండలంలోని రాజారాంపురం, శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగణగళ్లవానిపేట, కళ్లేపల్లి తదితర సముద్ర తీరాలు సందర్శకుల సందడితో కిటకిటలాడాయి. పిక్నిక్‌కు కుటుంబాలు, యువత, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి తీర ప్రాంతంలో కేరింతలతో సందడి చేశారు. తోటల్లో సేదతీరుతూ, సముద్ర స్నానాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. భావనపాడు సముద్రతీరంలో డిజె పాటలకు యువత నృత్యం చేస్తూ ఉత్సాహ వాతావరణాన్ని నెలకొల్పారు. అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో భావనపాడు తీరం నిండిపోయింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు ఆయా చోట్ల పహారా కాశారు. ప్రజలకు ప్రమాద హెచ్చరికలు సూచిస్తూ అవగాహన కల్పించారు.

ఆలయాల్లో రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలోని పలు శైవక్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులతో మంత్రి సమీక్షించారు. జిల్లాలోని ప్రధాన ఆలయాలైన శ్రీముఖలింగం, ఉమారుద్ర కోటేశ్వరాలయం, ఎండల మల్లికార్జున స్వామి ఆలయం, శ్రీకూర్మం, అరసవల్లి వంటి ప్రముఖ శైవ, వైష్ణవ క్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో క్యూలైన్లు, తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, చిన్నపిల్లలతో వచ్చే మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. భద్రత, రవాణా, ఆరోగ్య సేవలు, పారిశుధ్యం వంటి అంశాల్లో పోలీస్, రెవెన్యూ, వైద్యారోగ్య, దేవాదాయ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి నిర్విరామంగా పనిచేయాలని సూచించారు. గతానుభవాలను పరిగణనలోకి తీసుకుని, ఎక్కడా భక్తులకు ఇబ్బంది కలగకుండా మరింత మెరుగైన భద్రత, సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్‌కు శైలజ ఎంపిక

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఇచ్ఛాపురానికి చెందిన శైలజ ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన విశాఖపట్నంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఇటీవల నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించింది. శైలజ ఇచ్ఛాపురం కెజిబివిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శైలజను పిఇటి భారతి, కోచ్ బత్తుల రామారావు తదితరులు అభినందించారు.

అప్పలరాజుకు మళ్లీ నోటీసులు

ప్రజాశక్తి - పలాస

నకిలీ మద్యం, అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారని చేసిన ఆరోపణలపై మాజీ మంత్రి, వైసిపి నాయకులు డాక్టర్ సీదిరి అప్పలరాజుకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి అప్పలరాజు నివాసంలో ఆయనకు ఆదివారం నోటీసులు అందించారు. గత నెలలో నకిలీ మద్యంపై కాశీబుగ్గ శ్రీనివాస లాడ్జి జంక్షన్ వద్ద మహిళలతో కలిసి చేపట్టిన ఆందోళనలో మహిళా కానిస్టేబుల్‌పై వైసిపి కార్యకర్త ఒకరు అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో వైసిపి కార్యకర్తకు మద్దతుగా చేసిన వ్యాఖ్యలకు కూడా వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై విచారణకు సోమవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాలని తెలిపారు. కాగా, ఈనెల ఎనిమిదో తేదీన అప్పలరాజును ఏడు గంటలకు పైగా విచారణ చేసిన విషయం విదితమే.

నేటి నుంచి అర్ధ వార్షిక పరీక్షలు

ప్రజాశక్తి - టెక్కలి

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం నుంచి అర్ధ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 12వ తేదీ నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉన్నా, రెండు రోజుల ముందుగానే ప్రారంభమవుతున్నాయి. జిల్లాలో 2,955 ప్రభుత్వ పాఠశాలల ద్వారా 2,64,804 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సమగ్ర శిక్ష నుంచి మండలాలకు, అక్కడ్నుంచి క్లస్టర్ సముదాయాలకు చేరుకున్నాయి. మొదటి సెమిస్టర్ పుస్తకాల్లో పొందుపరిచిన సిలబస్ మేరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు రోజుకో పరీక్ష చొప్పున నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన టైమ్ టేబుల్‌ను విద్యార్థులకు తెలియజేశారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 6, 7 తరగతులకు మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన జవాబు పత్రాల పుస్తకాల్లోనే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. డిసెంబరు ఐదో తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్స్ నిర్వహించనున్న దృష్ట్యా పరీక్షలు ముగిసిన వెంటనే ఉపాధ్యాయులు మూల్యాంకనం చేపట్టి మార్కులను ప్రగతి పత్రాల్లో నమోదు చేయాల్సి ఉంది.

శత శాతం 'పది' ఫలితాలే లక్ష్యం

- వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక
- ప్రభుత్వ విద్య బలోపేతానికి చర్యలు
- జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు తెలిపారు. ఈనెలాఖరు నాటికి సిలబస్‌ను పూర్తి చేసి, వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు పాటిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యా బోధన చేస్తున్నట్లు చెప్పారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను ఆయన వెల్లడించారు.

? ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం లక్ష్యం ఎంత నిర్దేశించుకున్నారు?

2025-26 విద్యా సంవత్సరంలో శత శాతం ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. గతేడాది 82 శాతం ఫలితాలు సాధించాం. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే శత శాతం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం. అదే స్థాయిలో కరిక్యులం కొనసాగుతుంది. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

? మెరుగైన ఫలితాలకు ఎటువంటి ప్రణాళిక అమలు చేస్తున్నారు?

పదో తరగతి సిలబస్‌ను ఈనెలాఖరుకు పూర్తి చేస్తున్నాం. డిసెంబరు ఒకటో తేదీ నుంచి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నాం. వంద రోజులు ప్రత్యేక క్లాసులు నిర్వహించడం, స్లిప్ టెస్ట్‌లు పెట్టడం, స్లో లెర్నర్స్‌ను పరీక్షలకు సిద్ధం చేయటం వంటి లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నాం. వంద రోజుల ప్రణాళికలో ప్రతి సబ్జెక్టులో కనీసం 50 మార్కులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఈ ప్రణాళికతో తప్పకుండా శత శాతం ఫలితాలు సాధిస్తామని భావిస్తున్నాం.

? శత శాతం ఫలితాలు సాధ్యమేనా?

జిల్లాలో గతంలో తక్కువగా ఫలితాలు వచ్చిన 50 పాఠశాలలను గుర్తించాం. ఈ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక చర్యలు ప్రారంభించాం. సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎ, బి ప్రతిభావంతులు, సి, డి యావరేజ్, బిలో యావరేజ్ విద్యార్థులుగా గుర్తించి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రత్యేక శిక్షణ ఇస్తాం. అదనపు తరగతులు నిర్వహిస్తాం. ప్రాధాన్యత గల ప్రశ్నలపై ప్రత్యేక శిక్షణ ఇస్తాం. వెనుకబడిన విద్యార్థుల లోపాలను గుర్తించి మెరుగుదలకు కృషి చేస్తాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడతాం.

? ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నారు. వీరి వల్ల విద్యార్థులకు మెరుగైన బోధన సాధ్యమవుతోంది. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు ఇస్తున్నాం. పక్కాగా మధ్యాహ్నం భోజనం అమలు చేస్తున్నాం, తల్లికి వందనం ప్రభుత్వం అమలు చేస్తోంది. విద్యార్థుల పరీక్షలు గతంలోలా కాకుండా ఒకే బుక్‌లెట్‌పై నిర్వహిస్తున్నాం. ప్రతిభ మదింపు, విశ్లేషణ పద్ధతులు అమలు చేసి వ్యక్తిగత ప్రగతికి కృషి చేస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాన్ని మదించి వారిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం.

? విద్యా ప్రమాణాల మెరుగుకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఏమిటి?

నిపుణుల కమిటీ సూచనలు పాటిస్తున్నాం. మండల, జిల్లా అకడమిక్ ఫోరం ఏర్పాటు చేసి సూచనలు పాటిస్తున్నాం. 6 నుంచి పదో తరగతి విద్యార్థుల వ్యక్తిగత ప్రతిభ నిరంతరం పరిశీలిస్తున్నాం. విద్యార్థుల నైపుణ్య స్థాయి ఆధారంగా బోధన సాగుతోంది. స్లో లెర్నర్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. సిలబస్ రివిజన్, అదనపు తరగతుల నిర్వహణ వంటి వాటి వల్ల సత్ఫలితాలు సాధిస్తాం. అకడమిక్ కేలండర్ మేరకు ప్రణాళిక అమలు చేస్తున్నాం.

పరీక్షా కేంద్రం వద్ద ఉన్న విద్యార్థులు

నవోదయ మోడల్ పరీక్షకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళంలోని వికాస్ స్కూల్‌లో ఆదివారం ఉదయం నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రైమ్ అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ పరీక్ష 80 మార్కులకు నిర్వహించగా, 79 మార్కులతో సోంపేట మండలంలోని జి.బెలగాం ప్రాథమిక పాఠశాల విద్యార్థి పప్పల గిరీష్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రైమ్ అకాడమీ డైరెక్టర్ ఎస్.పావని, నిర్వాహకులు జి.శ్రీరామదత్త, ఎస్.పృథ్వీరాజ్ తెలిపారు. ప్రథమస్థానంలో నిలిచిన గిరీష్‌కు రూ.5 వేలు నగదు బహుమతి, 78 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన ఐదుగురు విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులను వికాస్ స్కూల్ డైరెక్టర్ కూన వేణుగోపాల్, బూరగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి హరిప్రసన్న చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ పరీక్షకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 450 మంది 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షల్లో విజేతలుగా నిలవాలని కోరారు.

దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న యాత్రికులు

అరసవల్లికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి- అరసవల్లి

అరసవల్లి ఆదిత్యుని ఆలయంలో కార్తీక మూడో ఆదివారం సందర్భంగా యాత్రికులు పోటెత్తారు. జలుమూరు బాలియాత్ర,, శ్రీకూర్మం ఆలయ దర్శనానికి వచ్చి వేలాది మంది యాత్రికుల తాకిడి అరసవల్లికి కనిపించింది. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది యాత్రికులకు సౌకర్యాలు కలిగించడంలో విఫలమయ్యారు. ఉచిత దర్శనాలు క్యూలైన్ల దగ్గర టెంట్లు వేయకపోవడంతో యాత్రికులు గంటల కొద్దీ ఎండలోనే ఉండి ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. కేశఖండనశాల వద్దా అరకొర సౌకర్యాలు కల్పించడంతో యాత్రికులు ఇబ్బందులు పడ్డారు. టిక్కెట్లు తీసుకొని వెళ్లేవారు కన్నా విఐపి పేరు చెప్పి చాలా మంది నేరుగా దర్శనాలకు వెళ్లడం, అలాగే పోలీసులు వారి బంధువులు, మిత్రులను ఎక్కువగా టిక్కెట్ లేకుండా దర్శనాలకు తీసుకెళ్లడం కనిపించింది. ఇదిలా ఉండగా ఆదిత్యుని ఆదాయం రూ.10,76,500 వచ్చినట్లు ఆలయ ఇఒ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ తెలిపారు. స్వామి వారి టిక్కెట్ల రూపంలో రూ.6,92,600, ప్రసాదాల రూపంలో రూ.2,69,640 ఆదాయం వచ్చిందన్నారు.

నేడు స్థానిక సెలవు రద్దు

టెక్కలి: కార్తీకమాస 3వ సోమవారం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన స్థానిక సెలవు రద్దయింది. ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచే అర్ధ వార్షిక పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక సెలవు రద్దయ్యింది. పరీక్షల షెడ్యూల్ 12న అని భావించిన కొన్ని పాఠశాలలు 3వ సోమవారం స్థానిక సెలవు మంజూరు చేసుకోవచ్చునని అనుకున్నారు. కానీ, పరీక్షలు కారణంగా వాటిని రద్దు చేశారు. అయితే ఈ విషయాన్ని ముందే గ్రహించిన కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు మాత్రం 2వ సోమవారం స్థానిక సెలవుని వినియోగించుకోవడం గమనార్హం. కార్తీక పౌర్ణమి తరువాత వచ్చే సోమవారం నాటికే శివాలయాల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రాధాన్యత ఉంది. పరీక్షల కారణంగా స్థానిక సెలవు రద్దు కావడంతో యథావిధిగానే పాఠశాలలు తెరుచుకోనున్నాయి.

వ్యాక్సిన్ వేసేదెవరు?

- 35 గ్రామాలకు ఒకరే ఎఎన్ఎం
- చిన్నారులకు తప్పని తిప్పలు
- ఆందోళనలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని రాజపురం పిహెచ్‌సికి ఎఎన్ఎంల కొరత వేధిస్తోంది. పిహెచ్‌సి పరిధిలో 35 గ్రామాలు ఉండగా, ప్రస్తుతం ఒక్క ఎఎన్ఎం మాత్రమే అందుబాటులో ఉన్నారు. వాస్తవానికి ఏడుగురు ఎఎన్ఎంలు ఉండాల్సి ఉన్నా... ఇటీవల చేపట్టిన బదిలీల్లో అందరూ వెళ్లిపోయి ఒక్కరే మిగిలారు. దీంతో చిన్న పిల్లలు, గర్భిణులకు వేయాల్సిన వ్యాక్సిన్లు నిలిచిపోయాయి. నాలుగు నెలలుగా వ్యాక్సిన్లు లేకపోవడంతో ఇటు చిన్నారులు, అటు గర్భిణుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డిప్యుటేషన్‌లో వచ్చిన వారు ఎక్కడ?

రాజపురం పిహెచ్‌సి పరిస్థితి తెలుసుకున్న అధికారులు ఇద్దరు ఎఎన్ఎంలకు డిప్యూటేషన్ వేశారు. ఒకరు బెలగాం పిహెచ్‌సి పరిధిలోని కరాపాడు సబ్ సెంటర్ నుంచి కాగా, మరొకరిని కంచిలి నుంచి వేశారు. వీరిలో ఒకరు యాక్సిడెంట్ జరిగిందని వారం రోజులుగా విధుల్లోకి రావడం లేదు. అంతేకాకుండా డాక్టర్‌కు సమాచారం కూడా ఇవ్వకుండా కేవలం ఫొటో పెట్టేసి విధులకు హాజరు కావడం లేదు. మరొకరు ఎవరైతే నాకేంటి అనేలా ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో కూడా అక్కడ సిబ్బందికి తెలియడం లేదు. దీనిపై పిహెచ్‌సి వైద్యుని ఆదేశాలు కూడా బేఖాతర్ చేయడం గమనార్హం. దీంతో కేవలం ఉన్న ఒక్క ఎఎన్ఎం మాత్రమే తనకు అవకాశం ఉన్నంత వరకూ పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు.

ఆందోళనలో చిన్నారుల తల్లిదండ్రులు

రెండేళ్ల వయసు లోపల ఉన్న చిన్నారులకు సుమారు తొమ్మిది రకాల వ్యాక్సిన్లు వేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వీరికి ఒక్క వ్యాక్సిన్ కూడా వేసిన అవకాశం లేకుండా పోతుంది. దీంతో తమ పిల్లలకు అసలు వ్యాక్సిన్లు వేస్తారా వేయ్యరా? అన్న సందిగ్ధంలో చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు. మరోవైపు గర్భిణులు పరిస్థితి అంతే. కేవలం ఆశా కార్యకర్తల సలహాలు సూచనలు మేరకే వీరు వెళ్తున్నారు. వీరికి వేయాల్సిన వ్యాక్సిన్లు వేయడం లేదు.

రాజపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వ్యాక్సిన్లు వేయడం లేదు

మా మనవరాలికి రెండు నెలలుగా వ్యాక్సిన్ వేయడం లేదు. ప్రతిసారీ ఈరోజు, రేపు అంటున్నారే తప్ప వ్యాక్సిన్లు మాత్రం వేయడం లేదు. ఏమని అడిగితే ఎఎన్ఎం లేరు అంటున్నారు.

- యాండ్రాపు గురుమూర్తి, ప్రగడపుట్టుగ

జాతీయస్థాయి గుర్తింపు తెచ్చుకోవాలి

ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

వజ్రపుకొత్తూరు : క్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని, దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగాలని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గోవిందపురం ఉన్నత పాఠశాలలో 69వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడా పోటీలను స్ఫూర్తిగా తీసుకొని జాతీయ స్థాయిలో రాణించాల న్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తుందని అన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. వైసిపి పాలనలో పాలనలో ఒక్క పిఇటి పోస్టు భర్తీ చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 854 పిఇటి పోస్టులను భర్తీ చేసిందన్నారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. క్రీడాకారులకు ఓటమిని అంగీకరించే క్రీడా స్ఫూర్తి అవసరం చెప్పారు. క్రీడాకారులకు మానసిక దృఢత్వం సహజ సిద్ధంగా అలవడుతుంన్నారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి డిస్కస్ త్రో, 200 మీ, 600 మీ పరుగు పందేలు, రిలే పరుగు పందేలు, లాంగ్ జంప్, హైజంప్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 572 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని విశాఖపట్నం జిల్లా జట్టు కైవసం చేసుకుంది. బాలికల వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ విశాఖపట్నం జట్టుకు చెందిన ఇషానా బొమ్మిరెడ్డి, లాంగ్ జంప్ బాలురు వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ విశాఖపట్నం జట్టుకు చెందిన ఎం.వికాస్ కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 22 అమ్మాయిలు, 22 మంది అబ్బాయిలు వచ్చే నెల మొదటి వారంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నిర్వహించే జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. క్రీడల ముగింపు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కార్ని రమణ, శ్రీకాకుళం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు కవితయ్య, ఉపాధ్యక్షులు రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, గజేంద్ర పద్మలోచన, చంద్రశేఖర్, పద్మనాభరెడ్డి మీట్ అబ్జర్వ్ లీలాకృష్ణ, ఉపాధ్యాయులు గొల్లపల్లి లక్ష్మణరావు, కణితి శ్రీరామ్మూర్తి, మెట్ట మోహనరావు పాల్గొన్నారు.

బహుమతులతో విద్యార్థులు

చెస్‌లో రాణించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరంలోని తిలక్‌నగర్ కాలనీలో ఆదివారం స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ ఆధ్వర్యాన చెక్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు సూర శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చెస్‌లో రాణించేలా సాధన చేయాలని కోరారు.

సమాజ సేవ మనందరి బాధ్యత

ప్రజాశక్తి- కవిటి

ఎస్‌విజె డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యాన సోమవారం నుంచి 16 వరకు నెలవంకలో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించనున్నట్టు కళాశాల మేనేజ్‌మెంట్ తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం, రహదారి ఇరు వైపులా మొక్కలు నాటడం, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారని తెలిపారు.

అరసవల్లి : కళ్లేపల్లిలో కాకినాడ ఆదిత్య మహిళా కళాశాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగించడం వల్ల వచ్చే అనర్థాలను విద్యార్థులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత రోజుల్లో చాలామంది సైబర్ నేరాలకు గురవుతున్నారని, ఎవరైతే సైబర్ క్రైమ్ బారిన పడతారో వారు వెంటనే సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు హరి మానస, పైడిరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం : మండలంలో తెలుకుంచిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పిఒ సంతోష్‌కుమార్ తెలిపారు. సమాజ సేవ మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దగ్ధమైన రేకుల ఇల్లు

రేకుల ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తండ్యాంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో నేతల జగన్నాథానికి చెందిన రేకుల ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంతలోనే సర్వస్వం భూడిదైంది. జగన్నాథం బెంగుళూరులో జీవనం సాగిస్తున్నారు. ఈయన తల్లిదండ్రులు తవుడు, పార్వతిలు గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గృహంలో ఉన్న విలువైన వస్తువులు, బంగారం, నగదు, డాక్యుమెంట్లు, ఇతరత్రా సామగ్రి కాలి భూడిదైందని స్థానికులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.15 లక్షలు ఆస్తినష్టం వాటిల్లి ఉంటుందని బాధితులు తెలిపారు.

16న సొండీల విస్తృతస్థాయి సమావేశం

రణస్థలం: ఈ నెల 16న ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా దుప్పాడ టిపిఆర్‌సి స్విమ్మింగ్ పూల్స్ గార్డెన్ ప్రాంగణంలో సొండీల విస్తృతస్థాయి రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎపి సొండి కుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అజెండా తీర్మానాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సంఘ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బ్లీచింగ్ సున్నం మిశ్రమాన్ని చల్లుతున్న కార్మికుడు

తండ్యాంలో పారిశుధ్య పనులు

పొందూరు : మండలంలోని తండ్యాం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సర్పంచ్ ప్రతినిధి కిల్లారి భాస్కర రావు ఆధ్వర్యాన ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో, కాలువల్లో, అపారిశుధ్య ప్రాంతాల్లో చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం బ్లీచింగ్, సున్నం మిశ్రమాన్ని కలిపి అపారిశుధ్య ప్రాంతాల్లో చల్లారు.

ప్రమాద బాధితునికి ఆర్థికసాయం

కవిటి: ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా బగుసోలకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ తరపున పొందూరుపుట్టుగకు చెందిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దూగాన రామ్మూర్తి కుటుంబానికి ఆదివారం రూ.4 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వై.వెంకటేష్, జి.అనిల్, వి.క్రతిక, జి.రుద్రకుమార్, క్రాంతి పాల్గొన్నారు. ఈ సహాయంతో సంతోషించిన గ్రామస్తులు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ...

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి

39 ఏళ్ల క్రితం వారంతా టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఆప్పటి మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. హాయ్...హాయ్ అంటూ సాగిన పలకరింపులతో వారు నడి వయసు కలవారని మర్చిపోయారు. ఒక్కసారిగా నూనుగుమీసాల వయసు జీవితంలోకి వెళ్లిపోయి స్థాయిలను మర్చి ఒకరిని ఒకరు పిలుచుకునే పద్ధతి, పలకరింపులతో ఆ ప్రాంతం సందడిగా మారింది. చదువు చెప్పిన తరగతి గదులే వారి పలకరింపుల మధ్య చిన్నబోయాయి. 77-84 విద్యా సంవత్సరంలో చదువుకున్న పాత మిత్రుల ఆత్మీయ కలయిక ఆదివారం టెక్కలి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసుకున్న 'చేయూత' ఛారిటబుల్ ట్రస్టు నిర్వహణపై సమీక్షించారు. ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలపై నివేదికని వినిపించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో వేదిక నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల ఆవరణలో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రస్టు ఆర్గనైజింగ్ అధ్యక్షులు, దంత వైద్యులు సంపతరావు జగదీష్, బెలుసోంటి నాగేశ్వరరావు, దుంపా శ్రీనివాస్, ఇళ్ల కోదండరావు, పొందర అప్పారావు, తిప్పాన ఆదినారాయణరెడ్డి, సునీల్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యం

ఎపిటిపిసి ఛైర్మన్ బాబూరావు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. మండలంలోని గరుడఖండి పంచాయతీ గోపాలపురం ప్రాథమిక పాఠశాలకు రూ.9.31 లక్షలు సమగ్ర శిక్షా అభియాన్ నిధులతో ప్రహరీ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, యవ్వారి మోహనరావు, సాసుమాన చంద్రమౌళి, పిఎసిఎస్ ఛైర్మన్ వంకల కూర్మారావు, దువ్వాడ శ్రీహర్ష, దువ్వాడ సంతోష్ రాంనాయుడు, మాజీ సర్పంచ్ సాసుమాన రామారావు, శాసుమాన సంతోష్, ఎంపిటిసి మాజీ సభ్యులు ప్రతినిధి కృష్ణంరాజు, కవిటి రవి, బొడ్డేపల్లి ప్రసాద్, అంపోలు రాజారావు, సిగిలిపల్లి లోకనాథం, ఎస్.సీతారాం, సాసుమాన హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న బాబూరావు

రేషన్ సబ్ డిపో ఏర్పాటు చేయాలి

సమస్యను వివరిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గేటుపేట, పెద్ద కేదారి, దబ్బగుడ్డి గ్రామ గిరిజనులు రేషన్ సబ్ డిపో మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు మండల టిడిపి గిరిజన నాయకుడు, పాతపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రతినిధి భైరిసింగి దినకర రావును ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ తాము అటవీ ప్రాంతంలో నివసిస్తున్నందున సమీప రేషన్ దుకాణానికి వెళ్లడం కష్టంగా మారుతుందన్నారు. అందువల్ల గ్రామంలోనే సబ్ డిపో ఏర్పాటు చేస్తే సౌకర్యం గా ఉంటుందని అన్నారు. దీనిపై స్పందించిన దినకర రావు మాట్లాడుతూ గిరిజనుల సమస్యను గుర్తించి త్వరలోనే ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

అతిథిగృహం కనుమరుగేనా?

ప్రజాశక్తి- టెక్కలి

వంశధార ప్రాజెక్టు నిర్మాణం సమయంలో టెక్కలిలో నిర్మించిన వంశధార అతిథిగృహం కనుమరుగవుతుంది. టెక్కలి తెంబూరు రోడ్డు మార్గంలో దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన వంశధార అతిథిగృహం ఒకప్పుడు ప్రముఖులకు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఆశ్రయం కల్పించింది. కాలక్రమంలో అతిథిగృహం మరుగునపడిపోయింది. వంశధార ప్రాజెక్టు పూర్తయిన తరువాత అతిథిగృహం కొన్నాళ్లు పాటు నిర్వహణ సాగింది. గడచిన దశాబ్దం కాలంగా అతిథిగృహం వినియోగం లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ ప్రాంతం పిచ్చిమొక్కలతో నిండి భయానకంగా కనిపిస్తుంది. ఒకప్పుడు ఆందంగా కనిపించే ఈ ప్రాంతం ప్రస్తుతం నిర్జీవంగా కనిపిస్తుంది. కాగా, వంశధార ప్రాజెక్టు స్థలంగా కేటాయించిన చాలా ప్రదేశం ఇప్పుడు కనుమరుగై పలు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణం చోటుచేసుకున్నాయి. ఈ స్థలంలోనే కొత్త జిల్లా ఆస్పత్రి, ఎస్‌సి బాలురు వసతిగృహాలు నిర్మించారు. కానీ, అతిథిగృహం నిర్మాణం మాత్రం నిర్మించకపోవడంతో ఈ ప్రదేశం భయంకరంగా మారింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన అతిథిగృహం పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు అధికం కావస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రం కావడం, జిల్లా ఆస్పత్రి దగ్గరగా ఉండడంతో ఈ అతిథిగృహం నిర్మిస్తే మంచిదని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పాలకులు, వంశధార ఉన్నతస్థాయి అదికారులు దృష్టిసారించి అతిథిగృహం నిర్మిస్తే మంచిదని పలువురు కోరుతున్నారు.

ఆనవాళ్లు కోల్పోయిన అతిథిగృహం

వ్యర్థాలతో అవస్థలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వ్యర్థాలతో పలు అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా పలు సమస్యలు తలెత్తుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. పర్లకిమిడి-పలాస రహదారికి ఆనుకుని ఉన్న మండల కేంద్రంలో ఇరువైపులా వ్యర్థాలను పారవేయడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రమాదాలు సంభవించడంతో పాటు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అనునిత్యం సేకరించిన చెత్తను రహదారికి ఇరువైపులా పారబోసి నిప్పంటించడంతో దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని వాహనదారులతో పాటు గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రుల సమయాల్లో దట్టమైన పొగ అలుముకొని రహదారి కనిపించక ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు.

కోళ్ల వ్యర్థాలతో...

మెళియాపుట్టి, చాపర గ్రామ సమీపంలో కోళ్ల నుంచి వచ్చిన వ్యర్థాలను పారవేయడంతో వీటికోసం సునకాలు రహదారిపై పరుగులు పెట్టడంతో వాహనాలకు అడ్డంగా పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వ్యర్థాల నుంచి వచ్చిన దుర్వాసనతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. ఈ గ్రామాల దగ్గరకు వచ్చేటప్పటికి ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీసం స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వ్యర్థాల వల్ల జరుగుతున్న అనర్థాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తద్వారా సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాలకు చెందిన వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాలు

క్రైమ్ కార్నర్

బస్సు ఢీకొని మహిళ మృతి

సుందరమ్మ (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలోని దంతకు చెందిన సాకిపల్లి సుందరమ్మ (62) ఆదివారం ఉదయం బస్సు ఢీకొని మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... మృతురాలు సుందరమ్మ తన ఇంటికొచ్చిన బంధువులకు బస్సును ఎక్కించేందుకు గ్రామంలోని కొత్తమ్మతల్లి ఆలయం వద్దకు వచ్చింది. కొత్తపల్లి నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు అక్కడకు చేరుకొని రీటర్న్ చేస్తుంది. ఈ సమయంలో వెనుక ఉన్న సుందరమ్మను డ్రైవర్ గమనించకపోవడంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి భర్త సూర్యనారాయణ ఐదేళ్ల క్రితం మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలు నీలవేణి, రాములమ్మలు ఉన్నారు. రాములమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోల్తా పడిన ట్రాక్టర్

ట్రాక్టర్ బోల్తా : బాలుడు మృతి

కవిటి: మండలంలోని కొజ్జిరియా కూడలి సమీపంలోని కల్వర్టు వద్ద ఆదివారం సాయంత్రం ఘోర ప్రమాదం సంభవించింది. ఇచ్ఛాపురం మండలం రత్తకన్న నుంచి జమేదార్ పుట్టుగకు ఇటుకల లోడుతో ట్రాక్టర్ వస్తుంది. డ్రైవర్ అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా హింజిలిఘాట్‌కు చెందిన కార్తీక్ దాస్ (16) ట్రాక్టర్ కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే బాలుడిని ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఎస్ఐ వి.రవివర్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు మృతి

ఉదయ్ (ఫైల్)

శ్రీకాకుళం సిటీ: నాగావళి నదిలో ఆదివారం స్నానానికి దిగి వమ్మి ఉదయ్ (20) మృతి చెందారు. నగరంలోని మహిళ మండల వీధికి చెందిన ఈయన స్నేహితులతో కలిసి స్నానం చేస్తున్నారు. నీరు ఉధృతికి ఉదయ్ కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

మరదలిపై బావ దాష్టీకం

రిమ్స్‌లో చికిత్స పొందుతున్న దానమ్మ

వజ్రపుకొత్తూరు : మండలంలోని సుంకరజగన్నాథపురానికి చెందిన విశ్రాంత విఆర్‌ఒ వి.లోహిదాసు మరదలు వంకల దానమ్మపై దాష్టీకం ప్రదర్శించాడు. ఆస్తి విషయానికి సంబంధించి దానమ్మ నిలదీయడంతో లోహిదాసుతో పాటు కుటుంబ సభ్యులు సరస్వతి, ప్రసాద్ కర్రలతో విచక్షణరహితంగా కొట్టారు. పోలీసులు, బాదితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుంకరజగన్నాథపురానికి చెందిన విశ్రాంత విఆర్‌ఒ లోహిదాసుడు అతని తమ్ముడు తవిటినాయుడు (లేటు) భార్య దానమ్మకు పక్క పక్కనే వారసత్వంగా వచ్చిన జీడి తోట ఉంది. జీడితోటలో లోహిదాసు దుక్కిదున్నగా మరదలు దానమ్మ అది తన వాటా అని, అందులో ఎలా దుక్కిదున్నుతారని ప్రశ్నించింది. దీంతో కోపోద్రిక్తులైన లోహిదాసు కుటుంబం వెళ్లి దానమ్మపై కర్రలు, ఇతర ఆయుధాలతో దాడికి తెగబడ్డారు. తీవ్ర గాయాలు, కవుకు దెబ్బలతో వెళ్లి శనివారం రాత్రి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమెను పోలీసులు వెంటనే పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమెకు లేవనేంతగా దెబ్బలు తగలడం, ఊపిరి ఆడక ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో పరీక్షించిన వైద్యులు ఆదివారం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె వెంటిలేటర్‌పైన ఉన్నట్లు బాదితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో పెద్ద మనుషుల వద్ద పరిష్కారానికి వెళ్లినా అక్కడ ఆమెకు న్యాయం జరగలేదని తెలిపారు. కాగా, లోహిదాసు తనకు శ్రీకాకుళంలో బంధువు టిడిపికి చెందిన బిసి కార్పొరేషన్ తెలుసునని, ఎంకేసు పెట్టుకుంటావో పెట్టుకో తనకు ఏమీ కాదని బెదిరిస్తున్నట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసి బెదిరిరింపుల నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు. బాధితురాలు దానమ్మ ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్ఐ బి.నిహార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

నందిగాం: మండలంలోని కర్లపూడికి చెందిన దుర్గాశి గీత అదృశ్యమైనట్టు ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ ఆదివారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... ఈ నెల 7న పెద్దతామరపల్లి యూనియన్ బ్యాంకు వెళ్లిందన్నారు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తండ్రి పరిసరాలను పరిశీలించారు. బంధువుల ఇళ్లల్లో వాకబు చేశారు. అప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో తండ్రి లచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. లచ్చయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గీతకు అదే గ్రామానికి చెందిన మేనత్త కొడుకుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు కుమారుడు ఉన్నారు.

జూదరుల అరెస్టు

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లాడ గ్రామ పరిధిలోని ఒక మామిడి తోటలో పేకాట ఆడుతున్న 15 మందిని పోలీసులు పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేశామన్నారు. పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.21,640 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

ఎస్పి మహేశ్వర రెడ్డి

ఎస్పి మహేశ్వర రెడ్డికి వివరిస్తున్న పోలీస్ సిబ్బంది, ఆలయ నిర్వాహకులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా మండలంలోని రావివలస ఎండ్ల మల్లికార్జున స్వామి ఆలయానికి యాత్రికుల రద్దీ అధికంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. రావివలస ఆలయ ప్రాంగణాన్ని సందర్శించి, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలను ఆదివారం స్వయంగా పరిశీలించారు. ఆలయానికి యాత్రికులు వచ్చి వెళ్లే ప్రధాన మార్గాలు, ఆలయ పరిసర ప్రాంతాలను సిసి కెమెరాల ద్వారా పరిశీలించారు. ఎక్కడైనా రద్దీ, ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా యాత్రికులు దర్శనాలు చేసుకునేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాల్లో బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు, తాగునీటి సదుపాయాలు, మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. యాత్రికుల సౌకర్యార్థం పటిష్టమైన క్యూ లైన్లు ఏర్పాటు చేయాలనిఆదేశించారు. కార్యక్రమంలో టెక్కలి సిఐ విజయకుమార్, ఎస్ఐ రాము పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

వారోత్సవాలను విజయవంతం చేయాలి

లావేరు : ఈ నెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు కోరారు. ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, ఆటలు, పాటలు, రంగవల్లి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 20న ముగింపు సభలో బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

ఆహారాన్ని అందజేస్తున్న ధనలక్ష్మి, గోవిందమ్మ

అన్నార్తులకు ఆహారం పంపిణీ

ఆమదాలవలస : కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పట్టణంలోని లెప్రసీ కాలనీలో అన్నార్తులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. మున్సిపాలిటీలోని మెట్టక్కివలసకు చెందిన గున్ను వెంకట అప్పారావు జ్ఞాపకార్థం గున్ను ధనలక్ష్మి, గోవిందమ్మ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది వృద్ధులు, వికలాంగులు, అనాథలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృత్విక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) మాట్లాడుతూ ఫౌండేషన్ తరఫున రక్తదాన శిబిరాలు, ఆహార పంపిణీలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బొడిగి హరీష్, రాము, ఆనంద్, అన్నెపు సురేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన సిబ్బంది

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సంతబొమ్మాళి : మండలంలోని ఇజ్జువరం పంచాయతీ పరిధిలోని రాజగోపాలపురంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న లోవోల్టేజ్ సమస్యకు తెరపడింది. మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సత్యనారాయణ చొరవతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్, పోల్స్ ఏర్పాటు చేసి వారం రోజుల్లో పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి, ఎఇకి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్ఆర్ఐ ఆనంద్ వితరణ

కవిటి: మండలంలోని బొరివంక పంచాయతీ పరిధిలోని బొగిడియపుట్టుగలో అసంపూర్తిగా ఉన్న నిమ్మాషినమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి బొరివంకకు చెందిన ఎన్ఆర్ఐ ఆనంద్ రౌలో ఆర్థికసాయం అందించారు. స్థానిక ఎంపిటిసి దుద్ది సతీష్ కుమార్ ఆధ్వర్యాన ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు రూ.36 వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటేష్, బాసు, శిల్పి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న సతీష్‌కుమార్

ఘనంగా వన భోజనాలు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పట్టణ కేంద్రంలోని జెసిహెచ్‌మ్‌లో ఆదివారం కళింగ వైశ్య కుటుంబం వనభోజన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. దీనిలో రక్తదాన శిబిరం నిర్వహించడం గొప్పదని, రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా పది మందికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో బోయిన గోవిందరాజులు, జామి వెంకటరావు, ఊన్న రాజశ్రీ, వెంకటేశ్వరరావు, బోయిన సతీష్, కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.

ఉదయం నిర్వహించిన కళింగ వైశ్య సామాజిక వర్గ కార్తీక వనభోజన కార్యక్రమంలో వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జెడ్‌పిటిసి చింతు రామారావు, పోలాకి ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, బిసి సెల్ అధ్యక్షులు బగ్గు రమణయ్య, నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్, కోటిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రణస్థలం : నూతన కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

రణస్థలం: రణస్థలంలోని ఐరిస్ సౌకల్య స్కూల్ ప్రాంగణంలో అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా బంధువులతో కార్తీక మాసం ఆత్మీయ సమ్మేళనం, వనసమారాధన, వనభోజనం నిర్వహించారు. అనంతరం 2026 కేలండర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కుమారుడు నడుకుదుటి ఈశ్వరరావు తనయుడు తేజబాబు, గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు కొమనాపల్లి లక్ష్మణప్రసాద్, ప్రధాన కార్యదర్శి జ్ఞానమూర్తి, జిల్లా యువజన కన్వీనర్ కొమనాపల్లి హరికృష్ణ, టిడిపి బిసి రాష్ట్ర సాధికార సమితి సభ్యులు, కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు ట్రైనింగ్ సెల్ ప్రిన్సిపాల్ గండేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రీన్ శ్రీకాకుళంగా మార్చాలి

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత స్వీకరించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు పిలుపునిచ్చారు. మన ఊరు, మన బాధ్యతలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల) ఆవరణలో మానవతా స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్‌తో కలిసి మొక్కలను నాటారు. మానవతా సంస్థ చైర్మన్ ఆచార్య డి.విష్ణుమూర్తి, అధ్యక్షులు బరాటం లక్ష్మణరావులు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ రోజు రోజుకీ పెరుగుతున్న కారణంగా పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలతో పాటు ప్రజల భాగస్వామ్యంగా ఉండాలన్నారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెంట్రల్ కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, కోశాధికారి బరాటం కృష్ణచైతన్య, నారా ఈశ్వరరావు, పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ పోలినాయుడు

'తెప్పల'కు వాగ్దేవి పురస్కారం

పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

పలాస : విశాఖపట్నం సింహాచలం శ్రీదేవి ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన తెలుగు సారస్వత పరిషత్ నిర్వహణలో పలాసకు చెందిన సీనియర్ రచయిత, నటుడు జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి వాగ్దేవి పురస్కారం లభించింది. తెలుగు సాహిత్య రంగంలో అహరహం చేయుచున్న కృషిని గుర్తించి దేహమే దేవాలయం అను కవితా పోటీలో విజేతగా నిలిచారు. అందుకు కృష్ణమూర్తికి వాగ్దేవి పురస్కారం లభించింది. తెలుగు సారస్వత జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ కె.రాంప్రసాద్, నాంపల్లి శ్రీనివాస్, ఉమామహేశ్వరరావులు కృష్ణమూర్తిని సత్కరించారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ లక్ష్మి

సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

శ్రీకాకుళం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్ఐ లక్ష్మి సూచించారు. జిల్లాలోని రౌడీ షీటర్లకు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల సూచనలు, ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెడు నడతగలవారిని పోలీస్ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి నేరాలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణచైతన్య

ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

నరసన్నపేట : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నరసన్నపేట పట్టణంలో ఈ నెల 12న చేపట్టనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వైసిపి యువ నాయకులు ధర్మాన కృష్ణచైతన్య కోరారు. ఈ మేరకు వైసిపి కార్యాలయంలో ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు, యువకులు, నియోజకవర్గంలోని వైసిపి నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, డిఎల్‌టిసి చైర్మన్ నక్క తులసీదాస్, పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కెసిహెచ్ గుప్తా, నియోజకవర్గ విభాగ అధ్యక్షులు గురుగుబెల్లి వెంకటరమణి పాల్గొన్నారు.

'కావేరా' పురస్కార ప్రదానం

అరసవల్లి: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో కథా రచయిత కణుగుల వెంకటరావు 95వ జయంతి సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ సుధీర్ ఆధ్వర్యాన కావేరా పురస్కారాలను ప్రదానం చేశారు. గాయకులు భారతీరమేష్ పలు కీర్తనలు ఆలపించారు. టి.కొండలరావు సెక్సోఫోన్, ఎస్.విగ్నేష్ మృదంగం, ఎం.వాయునందన శర్మ వయోలిన్, కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. వి.మహశ్రీ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు డాక్టర్ మధుకర్ మారోతిరావు విలేకరీను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, డాక్టర్ బి.కోమలరావు, సునరావు లక్ష్మీగణపతి శర్మ, డాక్టర్ దినేష్, ఎల్.రామలింగస్వామి, వైకుంఠరావు, డాక్టర్ సంపత్‌కుమార్, బలివాడ మల్లేశ్వరరావు, సోమసుందరి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అర్ధనారీశ్వర సైకత శిల్పం

మండలంలోని గాజులకొల్లివలస గ్రామ పరిధిలో కొండ దిగువన ఉన్న సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా అర్ధనారీశ్వర సైకత శిల్పం రూపొందించారు. ఈ శిల్పాన్ని సైకత శిల్పి గేదెల హరికృష్ణ తన ప్రతిభతో ఇసుకతో రూపొందించారు. ఆలయానికి విచ్చేసిన యాత్రికులు ఈ సైకత శిల్పాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు.

\- ప్రజాశక్తి, ఆమదాలవలస